జోరువాన
» ప్రవహిస్తున్న వాగులు, వంకలు
» తెగిపోయిన రోడ్లు.. జనజీవనం అస్తవ్యస్తం 7లో
జేఎన్టీయూకే ఇన్‌చార్జి వీసీగా మురళీకృష్ణ 7లో

ముసురేసింది!



కాకినాడ నగరంలో జోరుగా కురుస్తున్న వర్షం

- » అల్పపీడనం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా వానలే వానలు
- » గురువారం రోజంతా ముసురుతో ఎడతెరిపి లేకుండా వర్షం
- » నేటి మధ్యాహ్నం నుంచి జిల్లాకు భారీ నుంచి అతి భారీ వర్ష సూచన
- » ఈదురు గాలులు వీచే ప్రమాదం: కాకినాడ పోర్టుకు హెచ్చరిక జారీ
- » కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూంల ఏర్పాటు
- » సముద్రం అల్లకల్లోలంగా మారడంతో విదేశాలకు నిలిచిన బియ్యం ఎగుమతులు
- » రెండు నౌకల్లోకి ఆగిన లోడింగ్: నేడు మరో ఆరు నౌకల్లోనూ బంద్
- » అత్యధికంగా తాళ్లరేవు, పెదపూడి మండలాల్లో 4.3సెం.మీ. వర్షపాతం

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా గురువారం వర్షం కురిసింది. వాతావరణం ముసురేసి మోస్తరు నుంచి అక్కడక్కడా భారీగా వానలు పడ్డాయి. అల్పపీడనం మరింత బలపడనుండడంతో ఆ ప్రభావంతో శుక్రవారం మధ్యాహ్నం నుంచి జిల్లాకు భారీవర్ష సూచన జారీ అయింది. ప్రధానంగా శుక్రవారం రాత్రి నుంచి భారీ వర్షాలు కాస్తా అతి భారీగా మారే ప్రమాదం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. అటు కాకినాడ యాంకరేజ్ పోర్టుకు సైతం భారీ వర్ష సూచన ఆదేశాలు అందాయి. శుక్రవారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షాలతోపాటు ఈదురుగాలులు కూడా వీస్తాయని అప్రమత్తత జారీ అయింది. పైగా అల్పపీడనం ప్రభావంతో గురువారం సాయంత్రం నుంచి సముద్రం అల్లకల్లోలంగా మారింది. దీంతో యాంకరేజ్ పోర్టునుంచి విదేశాలకు బియ్యం ఎగుమతులు నిలిచిపోయాయి. పోర్టుకు దూరంగా లంగరు వేసిన రెండు విదేశీ నౌకలకు బార్జీలనుంచి బియ్యం రవాణాను నిలిపివేశారు. ఒకపక్క సముద్రం అల్లకల్లోలంగా ఉండడం, అటు వర్షాలతో లోడింగ్ నిలిపివేశారు. శుక్రవారం మధ్యాహ్నంనుంచి భారీవర్షం కురుస్తుందన్న హెచ్చరికలు జారీతో మరో ఆరు నౌకల్లోను బియ్యం లోడింగ్ నిలిపివేయాలని నిర్ణయించారు. కాగా అల్పపీడనం బలపడనుం డడంతో శుక్ర, శనివారాలు జిల్లావ్యాప్తంగా అక్కడక్కడా భారీనుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని గురువారం రాత్రి రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. మరో రెండురోజుల్లో అల్పపీడనం మరింత బలపడి ఒడిషా తీరం వైపు కదులుతుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో జిల్లావాసులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. భారీ వర్షంతోపాటు పిడుగులు పడతాయని అప్రమత్తం చేసింది. పొలాల్లో పనిచేసే రైతులు, పశు, గొర్రెల కాపరులు చెట్ల కింద ఉండొద్దని పేర్కొంది. కాగా జిల్లాకు భారీనుంచి అతిభారీవర్ష సూచన నేపథ్యంలో కలెక్టరేట్‌తోపాటు ఆర్డీవో కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. కాగా ఎగువన భారీవర్షాలు కురుస్తుండడంతో గోదావరికి వరద ఉధృతి అంతకంతకు పెరుగుతోంది. వాగులు వంకలు సైతం పొంగిపొర్లుతున్నాయి. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు పిలుపునిచ్చారు. గోదావరికి వరద పెరిగితే దిగువకు వదిలేస్తే జిల్లాలో తాళ్లరేవు మండలానికి వరద ముప్పు పొంచి ఉండనుంది. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. గోదావరి కాలువల్లో ప్రవాహం పెరగనుండడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. జిల్లావ్యాప్తంగా గురువారం దాదాపు అన్ని మండలాల్లో చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా తాళ్లరేవు, పెదపూడి మండలాల్లో 4.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో మి.మీ.లో కురిసింది. అటు కాకినాడ నగరంలో గురువారం మధ్యాహ్నం నుంచి వర్షం భారీగా కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆర్టీసీ బస్టాండ్ నీటమునిగింది.



కాకినాడ టూటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద డ్రైనేజీలు మూసుకుపోవడంతో రోడ్డుపైకి పోటెత్తిన వరద

తుఫాన్‌పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలి: సీఎస్

కలెక్టరేట్(కాకినాడ), జూలై 18: రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ గురువారం అమరావతి సీఎస్ కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనికి కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి, రెవెన్యూ, వైద్య ఆరోగ్యం, ఆర్డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలపట్ల అధికారులు అప్రమత్తతో వ్యవహరించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జ్ డీఆర్వో శ్రీరమ టి, డీఎంఅండ్‌హెచ్‌వో నరసింహనాయక్, స్వప్న పాల్గొన్నారు.

అల్పపీడనం ప్రభావంతో నిలిచిన ఫిషింగ్ బోట్లు



కాకినాడలోని కుంభాభిషేకం రేవువద్ద నిలిపివేసిన ఫిషింగ్ బోట్లు

కాకినాడ సిటీ, జూలై 18: అల్పపీడనం ప్రభావంతో కాకినాడ సముద్ర తీర ప్రాంతంలో ఫిషింగ్ బోట్లు నిలిచిపోయాయి. వాతావరణశాఖ హెచ్చరికతో బోట్లను తీరంలో కట్టి వేశారు. అల్పపీడనంవల్ల సముద్రంలో ఈదురుగాలులు ఉధృతంగా ఉండడంతో ఇప్పటికే చేపలవేటకు వెళ్లిన బోట్లను వెనక్కి తీసుకువచ్చేశారు. దీంతో బోటు కళాసీలు, మత్స్యకారులు ఇళ్లకే పరిమితమయ్యారు. కుంభాభిషేకం రేవువద్ద, జగన్నాథపురం వంతెన దిగువ ఉప్పుటేరులో బోట్లు నిలిపివేశారు. మూడురోజులపాటు ఈదురుగాలులతో వర్షాలు కురవనున్నందున సముద్రంలో చేపలవేటకు వెళ్లరాదని మత్స్యశాఖ అధికారులు హెచ్చరికలు జారీచేశారు. సముద్రంలో 61రోజులవేట విరామం ముగిసి నెలరోజులు దాటుతున్నా మత్స్యకారులకు ఇంకా పరిహారం అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గతనెల జూన్ 14తో సముద్రంలో చేపలవేట నిషేదం గడువు ముగిసింది. గతంలో వేటనిషేదం మొదలైన పదిరోజుల్లోనే మత్స్యకారులను గుర్తించి జాబితా మంజూరుకు పంపేవారు. ఈదఫా ఎన్నికల కోడ్ అమలుతో ఈ ప్రక్రియ చేపట్టలేదు. తదనంతరం జాబితాలను పంపారు. పెద్దబోట్లపై 8మంది, చిన్నబోట్లపై ఆరుగురు చొప్పున మత్స్యకారులకు రూ.10వేల చొప్పున వేట నిషేధ పరిహారం అందజేస్తారు. పరిహారం అందక వాతావరణం అనుకూలించక జీవనోపాధి దెబ్బతిని సతమతమవుతున్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు

కలెక్టరేట్(కాకినాడ), జూలై 18: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం నేపథ్యంలో కాకినాడలో జిల్లాలో శుక్రవారం, శనివారం, ఆదివారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటుచేశారు. తుఫాన్‌బాధితులు ఫోన్‌నెంబర్లు 99131 48180, 78010 07227, 70954 54117, 99899 00094నెంబర్లను సంప్రదించాలని అధికారులు తెలిపారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయి కంట్రోల్ రూమ్ రాజమహేంద్రవరం పర్యవేక్షక ఇంజనీరు కార్యాలయంలో ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరంలో జిల్లాస్థాయి కంట్రోల్ రూమ్ నెం 0883-2463354,7382299960

కాకినాడ ఆర్డీవో కార్యాలయం కంట్రోల్ రూమ్ నెంబరు

97015 79666



తహసీల్దార్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

కాకినాడ సిటీ, జూలై 18: భారీవర్షాల నేపథ్యంలో కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో సమాచారం కోసం 97015 79666 నెంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ తెలిపారు. కాకినాడలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో గురువారం డివిజన్‌లోని తహసీల్దార్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో మండల స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు, ఇతరులకు అవసరమైన శ్మశాన స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నందున వీటిని తక్షణం గుర్తించి తొలగించాలన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్థలం అవసరమైనచోట తక్షణం గుర్తించి సర్వే చేపట్టి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ పారిశుధ్యం మెరుగుదలకు అవసరమైన డంపింగ్ యార్డ్‌లకు స్థలాలను గుర్తించాలన్నారు. తహసీల్దార్లు, ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారి సౌజన్య, సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టరు అప్పారావు పాల్గొన్నారు.

దరఖాస్తులను గడువులోపు పరిష్కరించాలి: జేసీ

కలెక్టరేట్(కాకినాడ), జూలై 18: భూములు ఆన్‌లైన్‌లో నమోదు, సబ్ డివిజన్ నిమిత్తం ప్రజల నుంచి అందిన దరఖాస్తులను గడువులోపు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం అన్ని మండల సర్వేయర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములు నమోదు నిమిత్తం ఆన్‌లైన్, వివిధ మండల డివిజన్ కార్యాలయంలో అందిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టిపెట్టి తప్పనిసరిగా గడులోపు పరిష్కరించాలన్నారు. నిర్దిష్ట కారణం లేకుండా దరఖాస్తులను తిరస్కరించిన కేసులకు సంబంధించి కారణాలపై తగిన వివరాలు అందించాలన్నారు. సమావేశంలో జిల్లా సర్వేశాఖ ఏడీ లక్ష్మీనారాయణ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కాకినాడ, పెద్దాపురం డివిజనల్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

చెత్త పన్ను వసూలు అవాస్తవం

- » సోషల్ మీడియా ప్రచారంలో నిజం లేదు
- » పిఠాపురం మునిసిపల్ కమిషనరు కనకారావు

పిఠాపురం, జూలై 18: కూటమి ప్రభుత్వంపై ఏదొక విధంగా బురదజల్లేందుకు వైసీపీ విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా కూటమి ప్రభుత్వంలో చెత్త పన్ను డబుల్‌అంటూ.. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో చెత్త పన్ను వసూళ్లకు ఆదేశాలు జారీ అయ్యాయంటూ వైసీపీ సోషల్ మీడియాలో దుష్ప్రచారం సాగిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించింది. ఈ ప్రచారాన్ని తిప్పికొట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో తడి-పొడి చెత్త సేకరణకు చెత్త పన్ను వసూలు అంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని పిఠాపురం మునిసిపల్ కమిషనరు కనకారావు స్పష్టం చేశారు. ఇ-ఆటోలు వచ్చిన నాటినుంచి ఇప్పటివరకూ గృహ,వాణిజ్య సముదాయాలనుంచి యూజర్ చార్జీలు వసూలుచేయలేదని తెలిపారు. చెత్త పన్ను వసూలు చేయాలని ఎటువంటి ఆదేశాలు రాలేదని స్పష్టం చేశారు. కొంతకాలంగా మూలనపడ్డ ఇ-ఆటోలు తిరిగి వినియోగంలోకి వచ్చాయి. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా 8 ఇ-ఆటోలు రాగా, గతేడాది సెప్టెంబరు వరకూ ఇంటింటా తడి, పొడిచెత్త సేకరించారు. తదుపరి ఇవి మరమ్మతులకు గురికావడంతో మూలనపడ్డాయి. వీటిని తక్షణం వినియోగంలోకి తీసుకురావాలని డిప్యూటీ సీఎం ఆదేశాలతో ఇందులో ఏడు ఆటోలకు మరమ్మతులు నిర్వహించి వినియోగంలోకి తీసుకువచ్చామని కమిషనర్ తెలిపారు.



పిఠాపురంలో వినియోగంలోకి వచ్చిన ఇ-ఆటోలు

ఎట్టకేలకు కదలిక

- » తిమ్మాపురం బైపాస్ నిర్మాణ పనుల్లో పురోగతి
- » నిర్మాణాల్లో లోపాలతో ఇప్పటివరకు జాప్యం
- » కూటమి ప్రభుత్వం రాకతో పనులు ప్రారంభం



చీడిగ వద్ద పీయూపీ వంతెనకు అనుసంధానంగా జరుగుతున్న అప్రోచ్ నిర్మాణ పనులు



అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు

సర్పవరం జంక్షన్, జూలై 18: ఎట్టకేలకు తిమ్మాపురం-గురజనాపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ రోడ్డుతో ప్రారంభించిన మిగతా రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం జరిగినా, ఈ బైపాస్ రోడ్డు నిర్మాణ పనుల పురోగతిలో అడుగడుగునా అవాంతరాలు ఎదురవుతున్నాయి. వంతెనల నిర్మాణం, అప్రోచ్ రోడ్డు అనుసంధానం, రహదారి నిర్మాణాల్లో నాణ్యతకు తిలోదకాలు ఇవ్వడం, నిర్మాణ లోపాలతో చీడిగ, అచ్చంపేట సెంటర్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిల వద్ద బ్రిడ్జి గోడలు కుంగిపోయాయి. పలుచోట్ల రోడ్ల మధ్యలో బీటలు బారి గోతులుగా మారడంతో వీటిని పూడ్చించారు. బైపాస్ నిర్మాణ పనులను పర్యవేక్షించాల్సిన నేషనల్ హైవే అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా ఏళ్ల తరబడి నత్తనడకన నిర్మాణ పనులు సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ బైపాస్ రోడ్డు రహదారి నిర్మాణ పనులు జోరందుకున్నాయి. సత్వరంగా ఈ రహదారిలో అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

బైపాస్ నిర్మాణ పనుల్లో కదలిక

కాకినాడకు వచ్చే వాహనాల రద్దీని తగ్గించి, ప్రయాణికులకు ట్రాఫిక్ వెతలు తీర్చేందుకు వీలుగా 2015-16లో కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంనుంచి గురజనాపల్లి వరకు 19.225 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రహదారి పొడవునా 2 రైల్వేఓవర్ బ్రిడ్జిలు(ఆర్‌వోబీ)లు, 3 వెహికల్ అండర్ పాస్ (వీయుపీ) వంతెనలు అధికారులు నిర్మించారు. సామర్లకోట రహదారి మార్గంలో మాధవపట్నం దాటిన తర్వాత నిర్మించిన ఆర్‌వోబీ, చీడిగ వద్ద వీయూపీ బ్రిడ్జిల నిర్మాణం పూర్తయింది. ఈ వంతెనలకు అనుసంధానంగా అప్రోచ్ రోడ్డు నిర్మాణంలో జరిగిన నాణ్యతా లేమి, అధికారుల నిర్లక్ష్య వైఖరితో చీడిగలో వంతెన అనుసంధానం వద్ద సిమెంట్ గోడలు కిందకు కుంగిపోయాయి. అచ్చంపేట సెంటర్‌లో వీయూపీ వద్ద బ్రిడ్జి గోడ కూలిపోయింది. బైపాస్ నిర్మాణ పనులను పర్యవేక్షించాల్సిన ఎన్‌హెచ్ అధికారులు నిర్లక్ష్యవైఖరి ప్రదర్శించడంతో రహదారి నిర్మాణ పనులు పూర్తియి మూడేళ్లు కావస్తున్నా పీయుపీలు, ఆర్‌వోబీలకు అప్రోచ్ రోడ్డు అనుసంధానం చేయడంలో ఎడతెగని జాప్యం చోటుచేసుకోవడంపట్ల ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో తిమ్మాపురం-గురజనాపల్లి బైపాస్ నిర్మాణ పనులతో ప్రారంభించిన శంఖవరంనుంచి గుడిమెళ్లంక వరకు 127 కి.మీ మేర రహదారి విస్తరణ, కత్తిపూడి-తిమ్మాపురం మధ్య 27 కిలోమీటర్ల రోడ్డు ఎప్పుడో పూర్తి కావడం, వినియోగంలోకి రావడం జరిగాయి. జాతీయ రహదారుల అధికారుల ఉదాశీనవైఖరి, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఈ బైపాస్ రోడ్డు నిర్మాణం తీవ్రజాప్యం చోటుచేసుకుంటుంది. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అసంపూర్తి నిర్మాణ పనులపై అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులోభాగంగా తిమ్మాపురం-గురజనాపల్లి బైపాస్ రోడ్డులో అసంపూర్తిగా మిగిలిన అప్రోచ్ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. సత్వరంగా వంతెనలకు అప్రోచ్ అనుసంధాన పనులు పూర్తి చేసి ఈ రహదారిని వినియోగంలోకి తీసుకువచ్చేలా జిల్లా కలెక్టర్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎగుమతులకు గ్రీన్‌సిగ్నల్

- » కాకినాడ పోర్టులో బియ్యం ఎగుమతులకు అనుమతులు
- » పీడీఎస్(కెర్నెల్స్) కాని 24,159 మెట్రిక్ టన్నులు విడుదల
- » వీటిని గొడౌన్ల యాజమాన్యానికి ఇచ్చిన అధికారులు
- » ఇతర దేశాలకు ఎగుమతులు యథాతథం



కలెక్టరేట్(కాకినాడ), జూలై 18: కాకినాడ పోర్టులో బియ్యం ఎగుమతులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. 15రోజులుగా బియ్యం గొడౌన్లపై దాడుల నేపథ్యంలో తాత్కాలికంగా యాంకరేజ్ పోర్టులో బియ్యం ఎగుమతులు నిలిచిపోయాయి. దీంతో ఎక్కడ స్టాక్ అక్కడే నిలిచిపోయింది. సీజ్ చేసిన బియ్యం నిర్ధారణ పరీక్షలు జరగడంతో పీడీఎస్(కెర్నెల్స్) ఉన్న పోర్టిఫైడ్ బియ్యాన్ని గుర్తించారు. దీంతో ఇతర దేశాలకు ఎగుమతులను యధాతథం చేశారు. జిల్లాలో గతనెల 28న మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో పీడీఎస్ బియ్యం కోసం నిల్వఉంచిన గొడౌన్లపై దాడులు చేశారు. అప్పటినుంచి దాడులు కొనసాగుతూ వచ్చాయి. ఈ నేపథ్యంలో రూ.154కోట్ల విలువైన 50,647 మెట్రిక్ టన్నుల బియ్యం సీజ్ చేశారు. ఇవి కాన్‌కోర్, ఎస్ఆర్ జ్యోతి, హెచ్ గొడౌన్, అశోకా ఇంటర్నేషనల్, సార్టెక్స్ ఇండియా, సాయి తేజ షిప్పింగ్ సర్వీసెస్, విశ్వప్రియ ఎక్స్‌పోర్ట్స్, లావాణ్య ఇంటర్నేషనల్, అయ్యప్ప ఎక్స్‌పోర్ట్స్, శ్రీనివాసా ట్రేడింగ్ అండ్‌కో, సరళ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, బ్లూ ఓషియన్ మెరైన్ ప్రైవేట్ లిమిటెడ్, సత్యం బాలాజీ రైస్ ఇండస్ట్రీస్‌లో లభించాయి. దీంతో వీరిపై 6ఏ కేసులు నమోదు చేయడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. దీనిలో ఎంతమేరకు పీడీఎస్ బియ్యం నిల్వలు ఉన్నాయనే విషయం నిర్ధారించడానికి శాంపిల్స్ పౌరసరఫరాలశాఖ ల్యాబ్‌కు పంపారు. దీనిలో 26,488 మెట్రిక్ టన్నుల బియ్యం పీడీఎస్(కెర్నెల్స్) పోర్టిఫైడ్ బియ్యంగా నిర్ధారించారు. ఈ నేపథ్యంలో మిగిలిన బియ్యం 24,159 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఆయా గొడౌన్ల యాజమాన్యానికి అందజేశారు. బియ్యం ఇతర దేశాలకు ఎగుమతి చేసుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో గొడౌన్ల యాజమాన్యం కొంత వరకు ఊపిరి పీల్చుకున్నారు.

గొడౌన్లలో పీడీఎస్ బియ్యం నిర్ధారణ

వివిధ గొడౌన్లలో లభించిన బియ్యంలో పీడీఎస్(కెర్నెల్స్)గా నిర్ధారణ అయ్యింది. కాన్‌కోర్‌లో 411 మెట్రిక్ టన్నులు, ఎస్ఆర్ జ్యోతిలో 5780 మెట్రిక్ టన్నులు, హెచ్ గొడౌన్‌లో 2419 మెట్రిక్ టన్నులు, అశోకా ఇంటర్నేషనల్‌లో 3161 మెట్రిక్ టన్నులు, సార్టెక్స్ ఇండియాలో 73 మెట్రిక్ టన్నులు, సాయితేజ షిప్పింగ్ సర్వీసెస్ 330 మెట్రిక్ టన్నులుగా నిర్ధారణ అయ్యింది. విశ్వప్రియ ఎక్స్‌పోర్ట్స్‌లో 184 మెట్రిక్ టన్నులు, లావణ్య ఇంటర్నేషనల్‌లో 4459 మెట్రిక్ టన్నులు, శ్రీనివాసా ట్రేడింగ్ అండ్‌కోలో 709 మెట్రిక్ టన్నులు, సరళ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 818 మెట్రిక్ టన్నులు, బ్లూఓషియన్ మెరైన్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 1810 మెట్రిక్ టన్నులు, సత్యం బాలాజీ రైస్ ఇండస్ట్రీస్‌లో 6332 మెట్రిక్‌టన్నులను కెర్నెల్స్ ఉన్న పోర్టిఫైడ్ రైస్‌గా నిర్ధారించారు. వీటి మొత్తం విలువ రూ.75కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. దీంతో ఇవి అధికారుల సీజ్‌లో ఉన్నాయి.

బియ్యం అప్పగింత

గొడౌన్ల యాజమాన్యానికి తిరిగి ఇచ్చిన బియ్యం 24159 మెట్రిక్ టన్నులుగా ఉంది. పీడీఎస్ కాని బియ్యం 24,159 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అధికారులు గొడౌన్ల యాజమాన్యానికి తిరిగి ఇచ్చేశారు. వీటిని ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు ఆయా యాజమాన్యం సిద్ధమౌతోంది. వీటి విలువ రూ.79కోట్లు ఉంటుంది. వీటితో జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్‌లో సేకరించిన బియ్యాన్ని ఎగుమతి చేసేందుకు సిద్ధమవుతున్నారు.



పి.గన్నవరం మండలం గంటిపెదపూడి బూరుగులంక వద్ద కొట్టుకుపోయిన తాత్కాలిక రహదారి

రోడ్డుపైకి చేపలు..



అంతర్వేది, జూలై 18: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అంతర్వేది ఆలయ రహదారుల్లో వర్షపు నీటికి చేపలు బయటకు వచ్చేశాయి. ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో స్వామివారి సన్నిధికి దర్శనానికి వచ్చిన భక్తులు చేపలను చూసేందుకు ఉత్సాహపడ్డారు. స్థానిక యువకులు వలలతో రోడ్డుపై పొంగి పొర్లుతున్న నీటిలో ఎదురీదుతున్న చేపలను పట్టుకున్నారు. తాడేపల్లిగూడానికు చెందిన కొంతమంది భక్తులు దర్శనం అనంతరం సుమారు 50 కిలోల జల్లలు, గొరకలను పట్టుకున్నారు. ఈ చేపల ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియా వేదికగా హల్‌చల్ చేస్తున్నాయి.



చేపలు పడుతున్న స్థానికులు

కూనవరంలో కుండపోత



వాగులో చిక్కుకున్న ఉపాధి కూలీలు

కూనవరం, జూలై 18: కూనవరం మండలంలో కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా వర్షం కురవడంతో వాగులు, చెరువులు జలమయమయ్యాయి. మండలంలో 8.5 సెం.మీ వర్షపాతం నమోదు అయ్యింది. మండలంలోని టేకులబోరు గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు పనులు ముగించుకొని తిరిగి వస్తుండగా బోదునూరు అడవుల్లో ఒక్కసారిగా వాగులు పొంగడంతో చిక్కుకున్నారు. ప్రాణభయంతో ఒకరి చేయి ఒకరు పట్టుకొని బయటపడ్డారు.

జోరు వాన

ప్రవహిస్తున్న వాగులు,వంకలు.. తెగిపోయిన రోడ్లు..జనజీవనం అస్తవ్యస్తం

వాగుల ఉధృతి

వరరామచంద్రాపురం, జూలై 18: గురువారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి మండలంలోని వాగులు, వంకలు నిండి పొంగి పొర్లుతున్నాయి. చెరువులు నిండి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అవుతున్నాయి. మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ప్రధాన రహదారిలో ఉన్న అన్నవరం వాగు చప్టా పైనుంచి వర్షపు నీరు ప్రవహిస్తోంది. దీంతో మండల కేంద్రానికి రావడానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం వరకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి వరద కూడా క్రమేపీ పెరుగుతోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.



వరరామచంద్రపురం: అన్నవరం చప్టాపై నుంచి ప్రవహిస్తున్న వర్షపునీరు



గండిపోశమ్మ ఆలయాన్ని ముంచెత్తిన వరద నీరు

పోటెత్తిన గోదావరి

దేవీపట్నం, జూలై 18: అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలంలో గోదావరి పరీవాహక ప్రాంతాలైన కొండమొదలు, కచ్చులూరు, గొందూరు, మంటూరు, మూలపాడు, అగ్రహారం, తొయ్యేరు, పూడిపల్లి, పోశమ్మగండి తదితర గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయాన్ని గురువారం వరదనీరు చుట్టుముట్టడంతో అమ్మవారి విగ్రహం సగం వరకు నీట మునిగింది. దీంతో తాత్కాలికంగా అమ్మవారి దర్శనాలు నిలిపివేశారు. అలాగే పాపికొండలు విహారయాత్రను గత రెండు రోజుల నుంచి నిలుపుదల చేశారు. దండంగి వద్ద ఉన్న సీతపల్లి వాగుకు వరదనీరు ఎక్కువగా చేరడంతో వాగుకు అటువైపు ఉన్న చొప్పకొండ, గంగవరం, దామనపల్లి, కె.రామన్నపాలెం, మద్దిరాతిగూడెం తదితర గ్రామాలకు ప్రభుత్వ కార్యాలయాలకు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గురువారం ఉదయం నుంచి వర్షం అధికంగా కురవడంతో వాగులు పొంగి ప్రవహించి జనజీవనం స్తంభించింది. అలాగే ఎటపాక మండలం చింతలచెరువు గ్రామంలో వరదనీటికి రహదారి కొట్టుకుపోయింది. నల్లకుంట-గౌరీదేవిపేట గ్రామాల మధ్యలో రహదారిపై వరద ఉధృతి ఎక్కువవడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

ఎటపాక, జూలై 18: ఏజెన్సీలో ఉదయం నుంచి రాత్రి వరకు విరామం లేకుండా కుండపోతగా వర్షం పడడంతో జనజీవనం స్తంభించింది. వర్షం ధాటికి కృష్ణవరం పంచాయతీలోని చింతలచెరువు గ్రామం వెళ్లే ప్రధాన రహదారి కొట్టుకుపోయింది. రహదారికి ఇరువైపులా దెబ్బతింది. దీంతో ఇటు వైపు రాకపోకలు నిలిచిపోయాయి. నల్లకుంట-గౌరీదేవిపేట గ్రామాల మధ్యలో కల్వర్టు సమీపంలో రహదారిపై వరదనీరు ఉధృతంగా ప్రవహించింది. ఈ గ్రామాలకు మధ్యాహ్నం వరకు రాకపోకలు నిలిచాయి. భారీ వర్షానికి కృష్ణవరం గ్రామ శివారులోని కల్వర్టు ప్రాంతం వద్ద రహదారిని వరదనీరు ముంచెత్తింది. రహదారిపై ఉధృతంగా వరద ప్రవహించింది. దీంతో గిరిజనులు నడుములోతు నీటిలో ప్రమాదపు అంచున రాకపోకలు సాగిస్తున్నారు. మరోవైపు భారీ వర్షం ధాటికి అనేక గ్రామాల్లో వరదనీరు రహదారిపై ప్రవహిస్తూ, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేనిచోట వరదనీరు ఇళ్లలోకి చేరింది. భారీ వర్షానికి ప్రాజెక్టులు, చెరువులు, పంట పొలాలు నిండిపోయాయి. భారీ వర్షం ధాటికి ప్రజల దైనందిన జీవితానికి తీవ్ర ఆటంకం ఏర్పడింది.

తెగిపోయిన ప్రధాన రహదారి



కృష్ణవరం గ్రామ శివారులో ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్న గిరిజనులు

లంక గ్రామాల వైపు వరదనీరు



బూరుగులంక నదీపాయలో గోదారి పరవళ్లు

పి.గన్నవరం, జూలై 18: గోదావరి నది ఎగువన వివిధ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వరద నెమ్మదిగా పెరుగుతోంది. భద్రాచలంలో నీటి మట్టం పెరుగుతుండడంతో ధవళేశ్వరం బ్యారేజీ నుంచి మిగులు జలాలను సముద్రంలోకి వదులుతున్నారు. దీంతో కోనసీమ జిల్లాలోని గౌతమి, వృద్ధ గౌతమి, వశిష్ట, వైనతేయ నదీపాయలకు వరద తాకిడి మొదలైంది. పి.గన్నవరం మండలం గంటి పెదపూడి, ఉడిమూడికి చెందిన నాలుగు లంక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు బూరుగులంక నదీపాయ వద్ద ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక రహదారి గురువారం సాయంత్రం వరద ఉధృతికి నీటిలో కొట్టుకుపోయింది. ఆ సమయంలో రాకాసి అలలు ఎగసిపడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. గట్టుపైకి నీరు ప్రవహించిన అర గంటలోనే గట్టు పూర్తిగా కొట్టుకుపోవడంతో గంటి పెదపూడి శివారు పెదపూడిలంక, బూరుగులంక, అరిగెలవారిపేట, ఉడిమూడి శివారు ఉడిమూడిలంక గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఎర్ర నీరు పోయి తెలుపు నీరు వచ్చే వరకు నాలుగు నెలల పాటు లంక గ్రామస్తులు నాటు పడవలపైనే ప్రయాణం సాగించాల్సి ఉంది. తాత్కాలిక రహదారి కొట్టుకుపోతుందన్న ముందు జాగ్రత్తతో లంక గ్రామస్తులు తమ ద్విచక్ర వాహనాలను ఇవతలి ఒడ్డునే ఉంచేశారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ నదీపాయను పరిశీలించి ఇంజను బోటుపై అవతలి ఒడ్డుకు వెళ్లి తక్షణం చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో మాట్లాడారు.

రెండు ఇంజన్ బోట్లు ఏర్పాటు చేశాం

ఎస్‌కే హుస్సేన్, తహసీల్దారు

గంటి పెదపూడి శివారు బూరుగులంక వద్ద వరద ప్రవాహంలో తాత్కాలిక రహదారి కొట్టుకుపోవడంతో లంక గ్రామాల ప్రజల రాకపోకల నిమిత్తం రెండు ఇంజన్ పడవలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ఎస్‌కే హుస్సేన్ తెలిపారు. ఎస్ఐ బి.శివకృష్ణతో కలిసి ఆయన నదీపాయను పరిశీలించారు. రక్షణ నిమిత్తం లైఫ్ జాకెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నదీపాయ వద్ద రెవెన్యూ సిబ్బందితో పాటు పోలీసులు కూడా ఉండేలా ఆదేశాలు జారీ చేసామని చెప్పారు.

హుండీ చోరీ కేసులో ఇద్దరు మైనర్లతో సహా ముగ్గురి అరెస్టు

గొల్లప్రోలు, జూలై 18: ఆలయంలోని హుండీ చోరీ కేసులో ఇద్దరు మైనర్లు సహా ముగ్గురిని గొల్లప్రోలు పోలీసులు అరెస్టు చేశారు. గొల్లప్రోలు పట్టణంలోని రాయవరం రోడ్డులో వినాయక ఆలయం తలుపులు, హుండీ బద్దలు కొట్టి నగదును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన సంగతి తెలిసిందే. ఈ చోరీకి పాల్పడిన పిఠాపురం మండలం కుమారపురం గ్రామానికి చెందిన గుబ్బల దయానందపాల్(20)తో పాటు పిఠాపురం పట్టణానికి చెందిన 15, 16 సంవత్సరాలు వయస్సు కలిగిన ఇద్దరు మైనర్లను అరెస్టు చేసి రూ. 1070 నగదు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ జానీబాషా తెలిపారు.

నన్నయ ఇన్‌చార్జి వీసీగా శ్రీనివాసరావు



దివాన్‌చెరువు, జూలై 18: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతిగా ఆచార్య వై.శ్రీనివాసరావును నియమిస్తూ గురువారం ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నన్నయ విశ్వవిద్యాలయం భూగర్భ శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా, ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సెస్ డీన్‌గా, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా శ్రీనివాసరావు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీసీ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆయన వీసీగా బాధ్యతలు స్వీకరించారు. తనపై ఉన్న నమ్మకంతో వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా నియమించిన గవర్నర్, యూనివర్సిటీ కులపతి అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖమంత్రి నారా లోకేశ్, నాయకులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. నన్నయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి త్రికరణశుద్ధిగా పనిచేస్తానన్నారు.

జేఎన్టీయూకే ఇన్‌చార్జి వీసీగా మురళీకృష్ణ



మురళీకృష్ణ

జేఎన్టీయూకే, జూలై 18: ఏపీలోని 17 జేఎన్టీయూకే ఓడీఎల్, ఓఎల్ డైరెక్టర్, సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణను జేఎన్టీయూకే ఇన్‌చార్జ్ వీసీగా నియమించారు. ఆయన గతంలో అకడమిక్ ప్లానింగ్ డైరెక్టర్‌గాను, యూసీఈఎన్ ప్రిన్సిపాల్‌గాను విధులు నిర్వహించారు. 2015లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సాధించారు. ఆయన రచించిన 120 పేపర్లు ప్రచురణ కాగా 27 పుస్తకాలకు ఆధర్‌గా వ్యవహరించారు. జేఎన్టీయూకేలోని యూసీఈకే ఈఈఈ విభాగం ప్రొఫెసర్ ఆర్.శ్రీనివాసరావు మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ ఉపకులపతిగా నియమితులయ్యారు. ఆయన గతంలో డీఈగాను, డీఏపీగాను, ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తించారు.

విద్యుత్ తీగ తగిలి వ్యక్తి మృతి

శంఖవరం, జూలై 18: విద్యుత్ తీగ తగిలి శంఖవరం గ్రామానికి చెందిన కోన వీరలోవకుమార్ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం... మేకల మేతకు వెళ్లిన కుమార్ చెట్టు కొమ్మను కర్రకు కట్టి కత్తితో నరకుతుండగా కత్తి కర్ర విద్యుత్ తీగకు తగిలింది. దీంతో కుమార్ విద్యుత్ షాక్‌కు గురై మరణించాడు. టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వపరంగా సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

లారీ ఢీకొని దుర్మరణం



సామర్లకోట, జూలై 18: సామర్లకోట-హుస్సేన్‌పురం కెనాల్ రోడ్‌లో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై వెళుతున్న జి.మేడపాడుకు చెందిన గోనుపూడి రాజు(35) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదే ప్రమాదంలో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజు తన భార్య సునీతతో కలిసి సామర్లకోటకు వెళ్లి తిరిగి మోటార్ సైకిల్‌పై సామర్లకోట నుంచి జి.మేడపాడుకు వెళుతుండగా హుస్సేన్‌పురం సమీపించేసరికి రోడ్డు పక్క వేచి ఉన్న శిరీషను మోటార్‌సైకిల్ ఎక్కించుకునేందుకు ఆగడంతో అదే సమయంలో వెనుక నుంచి లారీ అతి వేగంగా మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరమేశ్వరుడికి సహస్ర ఘటాభిషేకం



గొల్లప్రోలు రూరల్, జూలై 18: వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పుష్కలంగా పండాలని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ గురువారం దుర్గాడ శివాలయంలో సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామంలోని శివాలయం మరోమారు సహస్ర ఘటాభిషేకానికి వేదికగా నిలిచింది. 48 సంవత్సరాలుగా ప్రతి ఏటా తొలి ఏకాదశి మరుసటి రోజు ద్వాదశి పర్వదినాన క్రమం తప్పకుండా నిర్వహించే ఈ కార్యక్రమం గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ జరిగింది. గ్రామంలోని శివాలయంలో వేంచేసి ఉన్న పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామిని గ్రామస్తులు జలాలతో అభిషేకించారు. ముందుగా మహిళలు తమ ఇళ్ల నుంచి పసుపు జలాలు తీసుకువచ్చి స్వామిని అభిషేకించారు. తదనంతరం ఆలయ ప్రాంగణంలోని కోనేటి నుంచి నీటిని బిందెలతో తీసుకువచ్చి శివలింగం పూర్తిగా నిండేవరకూ అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు జరిగాయి. సహస్ర ఘటాభిషేకం జరుగుతున్నంతసేపు ఆలయ పరిసరాలన్ని భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు ఆధ్వర్యంలో ఆదిత్య శర్మ, షణ్ముఖశర్మ, కారుణ్య, కార్తీక్, రామకృష్ణ, ఫణి, దిలీప్ శర్మ సహస్ర ఘటాభిషేకం, మహాన్యాపూర్వకంగా 11 రుద్రాలతో అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించగా కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



బిందెలతో క్యూలో ఉన్న భక్తులు

లారీ ఢీకొనడంతో వృద్ధురాలి మృతి



అనంతలక్ష్మి

మండపేట, జూలై 18: లారీ ఢీకొనడంతో గురువారం ఓ వృద్ధురాలు మృతిచెందింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట తర్వాణిపేటకు చెందిన ఇంటి అనంతలక్ష్మి (69) ద్వారపూడి పంచాయతీ పరిధి వేములపల్లిలో ఉన్న పరిశ్రమలో పనిచేస్తుంది. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. గురువారం పరిశ్రమలో పని ముగించుకుని వస్తున్న ఆమెను రాజానగరం మండలం తుంగపాడు నుంచి ద్వారపూడి వైపు వస్తున్న విజయవాడకు చెందిన లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఏఎస్ఐ అప్పారావు తెలిపారు.

డీఎల్ఎంటీలకు శిక్షణ తరగతులు ప్రారంభం

సామర్లకోట, జూలై 18: గ్రామాలలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం ఆవరణలో వివిధ అంశాలలో నిష్ణాతులైన అధికారులు అందించే శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ సూచించారు. సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం అవరణలో గురువారం జిల్లా స్థాయి మాస్టర్ లెవెల్ (డీఎల్ఎంటీ) అభ్యర్థులకు మూడు రోజుల శిక్షణా తరగతులను ప్రిన్సిపాల్ వేణుగోపాల్ ప్రారంభించారు. వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ మాట్లాడుతూ మూడురోజుల పాటు శిక్షణ పొందిన డీఎల్ఎంటీలు జిల్లాస్థాయిలో గ్రామాల నుంచి ఎంపిక చేసిన వారికి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈ శిక్షణా తరగతులు తొమ్మిది రోజుల పాటు జరగనుండగా ఒక్కో బ్యాచ్‌కు మూడు రోజులు చొప్పున రెసిడెన్షియల్ పద్ధతిన శిక్షణా తరగతులు నిర్వహించనుండగా శ్రీకాకుళం నుంచి ఏలూరు జిల్లాల వరకూ 11 జిల్లాల నుంచి మూడు బ్యాచ్‌లుగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఫ్యాకల్టీ జీవీ శ్రీదేవి, పి.శ్రీనివాసరావు, వి.ప్రసాద్ వివిధ అంశాలను వివరించారు. మొదటి రోజు శిక్షణా తరగతులకు 72 మంది హాజరయ్యారు.

జేఎన్టీయూకేలో ఐసీపీ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

జేఎన్టీయూకే, జూలై 18: ఇంటర్నేషనల్ కొలాబొరేటివ్ ప్రోగ్రాం(ఐసీపీ) కోర్సుల్లో సీట్ల భర్తీ సంబంధించిన కౌన్సెలింగ్‌ను గురువారం జేఎన్టీయూకేలోని సెనేట్‌హాల్లో వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఏఎం ప్రసాద్, ఎఫ్‌యూఏఆర్ డైరెక్టర్ శివనాగరాజు, యూసీఈజే ప్రిన్సిపాల్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మొదటిగా ఐసీ డైరెక్టర్ గురుదత్ వేల్పుల ఐసీపీ కోర్సు గురించి విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివరించారు. ఈ కోర్సులో చేరిన విద్యార్థులు మొదటి మూడేళ్లు కాకినాడ జేఎన్టీయూకేలోనూ చివరి మూడేళ్లు బీటీహెచ్ స్వీడన్‌లోనూ చదవాల్సి ఉంటుందన్నారు. 4వ ఏడాది కోర్సును బీటీహెచ్‌లో పూర్తిచేశాకా ప్రోగ్రాంనుంచి వైదొలిగే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు అడిగిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. సీఎస్ఈ, ఏఐఎంఎల్, ఈసీఈ కోర్సుల్లో మొత్తం 60సీట్లు ఉండగా మొత్తం 73మంది దరఖాస్తు చేశారని అడ్మిషన్స్ డైరెక్టర్ ఏఎం ప్రసాద్ తెలిపారు. కౌన్సెలింగ్ ద్వారా సీఎస్ఈలో 5, ఏఐఎంల్‌లో 12, ఈసీఈలో రెండు సీట్లు భర్తీ అయ్యాయన్నారు. త్వరలో మిగిలిన సీట్ల భర్తీకి సంబంధించిన రెండోదశ కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తామని తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం


అన్నవరం, జూలై 18: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి గురువారం గండి భరత్‌కుమార్ రెడ్డి లక్ష రూపాయలు విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని దాత ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందజేయగా దాత ఆయనను అభినందించి స్వామివారి ప్రసాదం అందజేశారు.

వెంకన్న ఆలయానికి సెంట్రల్ ఏసీ బహూకరణ



దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఈవో

ఆత్రేయపురం, జూలై 18: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి అంతరాలయం, గర్భాలయానికి రూ.19 లక్షల వ్యయంతో సెంట్రల్ ఎయిర్ కండిషనర్‌ను రాజమహేంద్రవరానికి చెందిన పోతల వేణుగోపాలరావు బహూకరించారు. దాతకు ఆలయ ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ స్వామివారి చిత్రపటం అందజేశారు. వివిధ సేవల ద్వారా గురువారం ఒక్కరోజు ఆదాయం రూ.1,64,588 లభించినట్టు ఈవో చెప్పారు.



పాటు చేసేనే పూట గడిచేది..

వానొచ్చినా.. వరదొచ్చినా.. రెక్కాడితే గానీ వారికి పూట గడవదు.. కడుపు నింపుకునేందుకు ఎటువంటి విపత్కర పరిస్థితుల్లోనైనా పనికి పోవాల్సిందే. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో రోజంతా హోరున వాన..గోదావరి మొదటి ప్రమాద హెచ్చరికలను దాటి ఉరకలు పెడుతోంది. అయినా లంకల్లో జీవనం సాగించే మత్స్యకారులకు మాత్రం వేట తప్పలేదు. గురువారం వారు వేటకు వెళుతున్న దృశ్యాలు 'ఆంధ్రజ్యోతి'కి కనిపించాయి.

–రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)

రేపు జడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

కాకినాడ సిటీ, జూలై 18: ఈనెల 20వ తేదీ శనివారం ఉదయం 10.30 గంటలకు కాకినాడలోని జడ్పీ సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం ఏర్పాటు చేసినట్లు జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు తెలిపారు. ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు ఆయా చైర్మన్ల అధ్యక్షతన జరుగుతాయన్నారు. ఈ సమావేశాలకు స్థాయీ సంఘాల సభ్యులు, అధికారులందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

కాకినాడ

ట్రాన్స్‌పోర్టు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

గండేపల్లి, జూలై 18: స్కూల్ విద్యార్థులను ట్రాన్స్‌పోర్టు విషయంలో కళాశాల యాజమాన్యం తగు జాగ్రత్తలు తీసుకోవాలని గండేపల్లి ఎస్ఐ ఎన్.రామకృష్ణ అన్నారు. ఆయన గురువారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ విద్యార్థులను తరలించే విషయంలో ప్యాసింజర్ ఆటోలు వినియోగించవద్దన్నారు.

కుష్ఠువ్యాధి నిర్మూలనకు చర్యలు: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), జూలై 18: జిల్లాలో కుష్ఠువ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో కుష్ఠువ్యాధి నిర్మూలనకు వివిధశాఖల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలనలో భాగంగా ఈనెల 18 నుంచి ఆగస్టు 2 వరకు జిల్లాలో ఇంటింటి సర్వే నిర్వహిస్తామన్నారు. మూడోఅడిషనల్ జిల్లా జడ్జి కమలాదేవి, జేసీ రామ్‌సుందర్‌రెడ్డి, జిల్లా వైద్యఆరోగ్యశాఖధికారి నరసింహనాయక్, జిల్లా కుష్ఠువ్యాధి నియంత్రణాధికారి రమేష్, పౌరసంబంధాలశాఖ డీడీ నాగార్జున పాల్గొన్నారు.

'పిండ లింగ నిర్ధారణ దుర్వినియోగం చేస్తే చర్యలు'

జిల్లాలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ ప్రక్రియలో పిండ లింగ నిర్ధారణకు దుర్వినియోగం చేస్తే వారికి మూడేళ్ల శిక్ష పడుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ హెచ్చరించారు. కాకినాడ కలెక్టరేట్‌లో పీసీ, పీఎన్డీటీ చట్టం అమలుపై గురువారం ఆయన అధ్యక్షతన జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్ట్రాస్కానింగ్ సెంటర్‌లో అక్రమ గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలకు ప్రజలనుంచి అధిక మొత్తంలో సొమ్ములు వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా మూడో అడిషనల్ జిల్లా జడ్జి కమలాదేవి, జేసీ రామ్‌సుందర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో నరసింహ నాయక్, దిశ డీఎస్పీ రామచంద్రరావు, డీసీహెచ్‌ఎస్ స్వప్న, డిప్యూటీ డీఎంహెచ్‌వో సరితా పాల్గొన్నారు.

'నాడు-నేడు పనులను సకాలంలో పూర్తిచేయాలి'

ప్రభుత్వ పాఠశాలలో నాడు-నేడు పనుల కింద చేపట్టిన వంటగది, మరుగుదొడ్ల పనులను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో గురువారం జిల్లా విద్యాశాఖకు సంబంధించి నాడు-నేడు పనుల్లో భాగంగా రెండో దశలో చేపట్టిన నిర్మాణ పనుల పురోగతి, ఎన్రోల్మెంట్, పుస్తకాల పంపిణీ తదితరల అంశాలపై సమీక్షించారు.

హెల్మెట్ తలకు భారంకాదు రక్షణ

● అదనపు జిల్లా జడ్జి వాసంతి
● రహదారి భద్రతపై పిఠాపురం, ప్రత్తిపాడులో న్యాయవాదుల ప్రదర్శన





పిఠాపురం, ప్రత్తిపాడులో హెల్మెట్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

పిఠాపురం, జూలై 18: హెల్మెట్ వినియోగంతో ప్రమాదాలు నుంచి రక్షణ లభిస్తుందని, హెల్మెట్ తలకు భారం కాదని రక్షణ అని 12వ అదనపు జిల్లా జడ్జి ఏ. వాసంతి అన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగం, ధరించడంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పిఠాపురం పట్టణంలోని కోర్టుల ప్రాంగణం నుంచి పురవీధుల్లో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా జడ్జి మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలు పాటించాలని, తప్పనిసరిగా డ్రైవింగ్‌లైసెన్స్‌తో పాటు వాహనానికి ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. రహదారులపై ప్రయాణించే సమయంలో అతి వేగం వద్దని సూచించారు. ర్యాలీలో అదనపు జిల్లా జడ్జి వాసంతి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి విజయరామేశ్వరి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాజారావు, ఉపాధ్యక్షుడు ఎస్ఎం ఆలీ, న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజు సెంటర్‌లో మానవహారం

ప్రత్తిపాడు, జూలై 18: రహదారి భద్రతపై గురువారం ప్రత్తిపాడులో న్యాయవాదులు ప్రదర్శన, మానవహారం నిర్వహించారు. స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు న్యాయవాదులు స్థానిక కోర్టు వద్ద నుంచి ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శనకు స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కాటం భాను ప్రారంభించారు. న్యాయవాదులు, విద్యార్థులు చేపట్టిన ఈ ర్యాలీ స్థానిక అల్లూరి సీతారామరాజు సెంటర్ వరకు జరిగింది. అల్లూరి జంక్షన్‌లో న్యాయవాదులు, విద్యార్థులు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి కాటం భాను మాట్లాడుతూ రహదారి భద్రత కోసం ప్రతిఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ ధారణతో పాటు సీటు బెల్ట్ వినియోగం, తదితర చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనుసింగరాజు కుక్కుటేశ్వరరావు, జనరల్ సెక్రటరీ బొంగుతూరు మధుబాబు, బార్ అసోసియేషన్ నాయకులు రమణం వెంకట్రావు, జొన్నాడ రాజేష్, పలివెల నాగేంద్రరాజు,సీనియర్ న్యాయవాదులు బుగతా శివ, రాజాల చిట్టిబాబు, శివకుమార్, పోలీసులు, అఖిల్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ

పెద్దాపురం, జూలై 18: హెల్మెట్ వినియోగంపై పట్టణంలో గురువారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. మండల లీగల్ సర్వీసె స్ అథారిటీ, రవాణా, పోలీస్‌శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఈ అవగాహన ర్యాలీని చేపట్టారు. ఈర్యాలీ స్థానిక మహారాణీ కళాశాల నుంచి నుంచి ప్రారంభమై పట్టణంలో ప్రధాన వీధుల గుండా సా గింది. హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం ద్వారా అనుకోని ప్రమాదాల భారినుంచి మనకు రక్షణ కలుగుతుందని, ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.హరినాథరెడ్డి అన్నారు. కార్యక్రమంలో మహారాణీ కళాశాల ప్రిన్సిపాల్ జోతీర్మయి, సీఐ రవికుమార్, జిల్లా మానవహక్కుల సంఘం అధ్యక్షుడు నూతులపాటి అప్పలకొండ, న్యాయవాదులు మడికి రాంబాబు, ఎస్‌కే వలీబాబు, చినచంటి, విశాలాక్షి, పారాలీగల్ వలం టీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలు ఆకలిబాధలు పడకూడదనే లక్ష్యం

● పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ



అన్నక్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న వర్మ

పిఠాపురం, జూలై 18: పేద, బలహీన, అట్టడుగు వర్గాలు ప్రజలు, వివిధ పనులు నిమిత్తంవచ్చే వారు ఆకలి బాధలు పడకూడదనే లక్ష్యంతో అన్న క్యాంటీన్‌లు నిర్వహిస్తున్నామని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. వర్మాస్ కావ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో పిఠాపురం పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో నిర్వహించే అన్నక్యాంటీన్‌ను ఆయన గురువారం ప్రారంభించి భోజనాలు వడ్డించారు. ప్రతి గురువారం సంత సందర్భంగా మార్కెట్‌కు వచ్చేవారు అన్నపానీయాలు కోసం ఇబ్బంది పడకూడదని గత నాలుగేళ్లుగా ఈ క్యాంటీన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పిఠాపురంలో ఆగస్టు 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్నదని వివరించారు. పిఠాపురంతో పాటు గొల్లప్రోలు, ఉప్పాడ, చేబ్రోలు తదితర ప్రాంతాల్లో అన్నక్యాంటీన్‌లు ఏర్పాటు చేయాలని అధికారులను కోరినట్లు తెలిపారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకు ముందు పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా గతంలో నిర్మించిన అన్నక్యాంటీన్ భవనాన్ని వర్మ పరిశీలించారు.

చేపల చెరువులపై చర్యలు తీసుకోవాలి

పిఠాపురం మండలం మంగితుర్తి, కోలంక గ్రామాల పరిధిలో 60 ఎకరాల్లో చేపలు చెరువులు ఉన్నాయని, ఈ చెరువులు నుంచి వచ్చే వ్యర్థజలాలు వలన పంటకాలువల్లో సాగునీరు కలుషితం కావడంతో పాటు పంటపొలాలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చేపలచెరువుల వ్యర్థజలాలు నుంచి తమను కాపాడాలని ఆయా గ్రామాల రైతులు గురువారం పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై తాను జిల్లా కలెక్టరుతో మాట్లాడతానని వర్మ హామీ ఇచ్చారు.

జనసేన పార్టీ బలోపేతంలో భాగస్వాములు కావాలి

●కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ



సెల్‌ఫోన్‌లో క్రియాశీలక సభ్యత్వం అందిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

జనసేన సర్పవరం జంక్షన్, జూలై 18: ప్రజాకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న జనసేనపార్టీ బలోపేతంలో క్రియాశీలక సభ్యులుగా చేరి భాగస్వాములు కావాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పిలుపునిచ్చారు. గురువారం గొడారిగుంటలో ఎమ్మెల్యే నివాసంవద్ద జనసేనపార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధ్యక్షులు, డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాల మేరకు గురువారం నుంచి ఈనెల 18 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ ఏడాది 20వేలు సభ్యత్వాలు నమోదుకోసం కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కరెడ్ల గోవిందు, శిరంగు శ్రీనివాసరావు, మాదారపు తాతాజీ, నందిపాటిత్రిమూర్తులు, ఛైర్మన్ శ్రీను, జీని శ్రీనివాస్, సోడె ముసలయ్య, సలాది శ్రీనివాస్ బాబా, రాయుడు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

'కార్యకర్తల సంక్షేమానికి జనసేన ప్రాధాన్యం'

గొల్లప్రోలు: కార్యకర్తల సంక్షేమానికి జనసేన అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఆ పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. గొల్లప్రోలు పట్టణంలోని నగరపంచాయతీ కార్యాలయం సమీపంలో ఏర్పాటుచేసిన కార్యాలయంలో జనసేన సభ్యత్వాలను ఆయనప్రారంభించారు. జనసేన క్రియాశీలక సభ్యత్వాలు తీసుకున్న వారిని సత్కరించారు. తొలుతగా ఉప్పల రాజాకు సభ్యత్వం అందించారు. కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

క్రియాశీలక సభ్యత్వాలతో కార్యకర్తలకు భరోసా

పెద్దాపురం, జూలై18 : క్రియాశీలక సభ్యత్వాలతో జనసేన కార్యకర్తలకు భరోసా కలుగుతుందని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. సుమారు 10 రోజులపాటు ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. సభ్యత్వ నమోదు ప్రక్రియ విధివిధానాలను కార్యకర్తలకు వివరించారు. జనసేన నేతలు పొలమరశెట్టి సత్తిబాబు, గణేష్, పిట్టా జానకిరామయ్య, నాగబాబు పాల్గొన్నారు.

అట్టహాసంగా జనసేన సభ్యత్వాల నమోదు

జగ్గంపేట: జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం రామచంద్రపురం గ్రామంలో అట్టహాసంగా జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. రామచంద్రపురం గ్రామం జనసేన తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్ అధ్యక్షతన 4వ విడత క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం గ్రామసర్పంచ్ తుమ్మలపల్లి సాయిగుణశేఖర్ తన జనసేనపార్టీ సభ్యత్వాన్ని నమోదు చేశారు. తుమ్మలపల్లి రమేష్ చేతులమీదుగా 50మందికి సభ్యత్వం నమోదు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్, రామవరం ఎక్స్ ఎంపీటీసీ మేక వీరబాబు, తామరాడ ఎంపీటీసీ గోకేడ రాజా, గోకేడ ప్రసాద్, కాయల మణికంఠ, గణేష్, పబ్బిరెడ్డి మణికంఠ, వీరబాబు, రేపూరి శ్రీనివాస్ ఇతరులు పాల్గొన్నారు.

ఎస్వీ రంగారావుకు భారతరత్న అవార్డు ఇవ్వాలి



ఎస్వీ రంగారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సర్పవరంజంక్షన్, జూలై 18: వెండి తెర ఇలవేల్పు విశ్వనటచక్రవర్తి ఎస్వీ రంగారావుకు భారతరత్న అవార్డు ఇవ్వాలని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు డిమాండ్ చేశారు. గురువారం నాగమల్లి తోట జంక్షన్ సమీపంలో ఎస్వీ రంగారావు వర్ధంతి పురస్కరించుకుని ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలోసంఘం గౌరవాధ్యక్షుడు బసవా ప్రభాకరరావు, అడపా ప్రకాశ్‌నాయుడు, తుమ్మలపల్లి వాసు, బిందాని సురేష్, వాసిరెడ్డి జ్యోతి కుమార్, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు. ఎస్వీ రంగారావు కమిటీ ఛైర్మన్ కె.నాగబాబు ఆధ్వర్యంలో ఎస్వీ రంగారావు విగ్రహానికి కాకినాడరూరల్ ఎంపీపీ బిందిలి విరీష, వైసీపీ నాయకులు కురసాల సత్యనారాయణలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పుల్ల కోటేశ్వరరావు, కరీం భాషా, రాందేవు చిన్న, రవి పాల్గొన్నారు.

శాకాంబరీ అలంకరణలో ఉప్పాలమ్మతల్లి



కరప, జూలై 18: కరప గ్రామదేవత ఉప్పాలమ్మతల్లిని గురువారం శాకాంబరీ అమ్మవారిగా అలంకరించారు. వైస్ ఎంపీపీ పాట్టీడి సత్యభీమేశ్వరరావు(భీమన్న) సహకారంతో అమ్మవారిని వివిధ రకాల కాయగూరలు, ఆకుకూరలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కుంకుమపూజలు జరుగుతాయని, అనంతరం అమ్మవారికి అలంకరించిన ఈ కాయగూరలతో అన్నదానం ఏర్పాటుచేస్తామని ఆలయకమిటీ సభ్యులు తెలిపారు.

21న శాకాంబరి అలంకరణ

పోర్టుసిటీ(కాకినాడ), జూలై 18: నగరంలోని సూర్యారావుపేటలోని బాలాత్రిపురసుందరిదేవీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని ఈనెల 21న శాకంబరిగా అలంకరణ చేస్తున్నట్లు ఆలయ ఈవో సీహెచ్ విజయభాస్కరరెడ్డి తెలిపారు. ఆషాడంలో అమ్మవారికి ఈ అలంకరణ చేయడం ఆనవాయితీగా వస్తోందని వివరించారు. భక్తులు కాయగూరలు, పండ్లను శనివారం సాయంత్రం 5గంటలలోగా దేవస్థానంలో అందజేయాలని తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 19 మందికి శిక్ష

● ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం, జూలై 18: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 19మందికి శిక్ష పడినట్టు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ ట్రాఫిక్ -1 పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏడుగురు, ట్రాఫిక్-2 పోలీస్‌స్టేషన్ పరిధిలో 12మంది మద్యం తాగి వాహనాలు నడుపుతుంటే పట్టుకున్నామన్నారు. నిందితులను 3వ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా వారిలో ముగ్గురికి రెండురోజుల చొప్పున జైలుశిక్ష, మిగిలిన 16మందికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారని వివరించారు.

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని హోంమంత్రికి ఫిర్యాదు

కరప, జూలై 18: భర్త వేధింపులకు గురవుతున్న తమ కుమార్తెను రక్షించి, కరప ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కొంగోడు గ్రామానికి చెందిన పి.సత్యనారాయణ, పార్వతి దంపతులు గురువారం రాష్ట్ర సచివాలయంలో హోంశాఖా మంత్రి వంగలపూడి అనితకు ఫిర్యాదు చేశారు. తమ చిన్నకుమార్తె వెంకటలక్ష్మిని వేమగిరికి చెందిన పి.బాలకృష్ణ అనే వ్యక్తి మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండా బలవంతంగా పెళ్లి చేసుకుని వేధింపులకు గు రిచేస్తున్నాడని హోంమంత్రికి తెలిపారు. దీనిపై కరప ఎస్ఐ రామకృష్ణ దృష్టికి తీసుకునివెళ్లగా సదరు ఎస్ఐ కేసు తీసుకోకపోగా తమను పరుష పదజాలంతో దూషించారని మంత్రికి ఫిర్యాదుచేశారు. దీనిపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని మంత్రి అనిత జిల్లా ఎస్పీని ఆదేశించారు.

వ్యాన్ ఢీకొని మోటార్ సైక్లిస్ట్‌కి తీవ్ర గాయాలు

కరప, జూలై 18: కరప మండలం పెదకొత్తూరు చెరువువద్ద గురువారం వ్యాన్ ఢీకొని మోటార్‌సైక్లిస్ట్ తీవ్రంగా గాయపడ్డాడు. కరప పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలం ఇల్లపర్రు గ్రామానికి చెందిన కట్టా పృధ్వినాగ్ కాకినాడలోని ఒక వాషింగ్ మెషీన్ల సర్వీసింగ్ పాయింట్‌లో పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం రామచంద్రపురంలో వాషింగ్ మెషీన్ కంప్లైంట్ చేసిన పృధ్వినాగ్ బైక్‌పై తిరిగి కాకినాడ ప్రయాణమయ్యాడు. పెదకొత్తూరు చెరువు టర్నింగ్ వద్దకు వచ్చే సరికి కాకినాడ నుంచి రామచంద్రపురం వైపు పనసకాయల లోడుతో వెళ్తున్న వ్యాన్ అతన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి సోదరుడు జి.దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

'హౌసింగ్ బిల్లులు పెండింగ్ లేకుండా చూడండి'

గండేపల్లి, జూలై 18: ఇళ్ల నిర్మించుకునే లబ్ధిదారులకు బిల్లులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు మంజూరు చేయాలని హౌసింగ్ ఈఈ గుప్తా అన్నారు. ఆయన గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ, ఇంజనీరింగ్, హౌసింగ్ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ వందరోజులు వర్కింగ్ ప్లాన్, మస్తర్లు, మరుగుదొడ్ల బిల్లులు పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు, ఏఈ రాంబాబు, ఎంపీడీవో హనుమంతరావు, ఏపీవో గంగాభవానీ, వర్క్ఇన్‌స్పెక్టర్ నరసింహం ఉన్నారు.

మహిళలపై జరుగుతున్న అకృత్యాలకు అడ్డుకట్టవేయాలి : డీఎస్పీ

జగ్గంపేట, జూలై18: కాట్రావులపల్లి గ్రామంలో జగ్గంపేట సీఐ ఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సమాజంలో మహిళలు, చిన్నారుల పట్ల జరుగుతున్న అకృత్యాలను అడ్డుకట్టవేసేందుకు అవగాహన కల్పించారు. మహిళల రక్షణకోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు వివరించారు. కార్యక్రమంలో జగ్గంపేట సీఐ ఎస్ లక్ష్మణరావు, జగ్గంపేట స్టేషన్ సిబ్బంది, అధిక స్థాయిలో మహిళలు పాల్గొన్నారు.

బాలలు, మహిళా చట్టాలపై ఆవశ్యకత అవసరం

తాళ్లరేవు, జూలై 18: మహిళా చట్టాలు బాలల హక్కులపై ఆవశ్యకత చాలా అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.బి.మాణిక్యం అన్నారు. గురువారం ఇంజరం జిల్లా ప్రజాపరిషత్ హైస్కూల్లో ఇంజరం అంగన్వాడీ సెక్టారు ప్రతినిధి ఆదిలక్ష్మి అధ్యక్షతన బాలలు, మహిళా చట్టాలపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ఇంజరం సెక్టారు పరిధిలోని అంగ న్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే మిషన్ శక్తి ఉద్దేశం

కిర్లంపూడి, జూలై18: మహిళా రక్షణ, భద్రత, సాధికారతే మిషన్ శక్తి ముఖ్యోద్దేశమని సీడీపీవో ఎం.పూర్ణిమ అన్నారు. గురువారం మండలంలోని బూరుగుపూడి హైస్కూల్‌లో మిషన్ శక్తిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్థికంగా శక్తిమంతులను చేయడం, ఆర్థికఅక్షరాస్యత, సూక్ష్మరుణాలు ఇవ్వడం వంటి వాటిని ప్రోత్సహించడం ద్వారా మహిళలపై సంరక్షణ భారాన్ని తగ్గించడం, మహిళా కార్మికశక్తి భాగస్వామ్యాన్ని పెంచవచ్చన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆసుకు రామలక్ష్మి, బద్రి, మాజీ ఎంపీటీసీ పాటంశెట్టి రవి, నాయకులు పాటంశెట్టి కొండరాజులు, వై.రాంబాబు, జ్యోతుల దుర్గాప్రసాద్, బాలిన వెంకటేశ్వరరావు, హెచ్ఎం అన్నపూర్ణ, సూపర్‌వైజర్ కరీమునీషా పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల పట్ల అవగాహన ఉండాలి

ప్రత్తిపాడు, జూలై18: వినియోగదారుల హక్కుల పట్ల మహిళలు, వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలని వెలుగు ఏపీఎం వై. వెంకట్, ఏపీ కంన్జూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా మహిళా అధ్యక్షురాలు శేషుకుమారిలు తెలిపారు. వెలుగు కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల వినియోగదారుల సమావేశంలో వారు మాట్లాడారు. వినియోగదారులకు ఎటువంటి సమస్యలు తలెత్తినా పోరం దృష్టికి తీసుకురావాలని వారు కోరారు. ఈ సమావేశంలో మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

జీఎంపేట మాజీ సర్పంచ్ బంగారమ్మ మృతి

● అంతిమ యాత్రకు తరలివచ్చిన మత్స్యకారులు



నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు



మృతి చెందిన కోడ బంగారమ్మ(ఫైల్)

తొండంగి, జూలై 18: టీడీపీ మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు కోడ వెంకటరమణమాత్యమూర్తి, జీఎంపేట మాజీ సర్పంచ్ కోడ బంగారమ్మ(68) బుధవారంరాత్రి మృతి చెందారు. గత కొద్దికాలంగా అస్వస్థతతో ఉన్న ఆమె ఇటీవల కాకినాడలో చికిత్స పొంది ఇంటికి తిరిగి వచ్చారు. తిరిగి అస్వస్థతకు గురై ఇంటి వద్దే ఆమె కన్నుమూశారు. జీఎంపేట పంచాయతీకి మొట్టమొదటి సర్పంచ్‌గా పనిచేసిన ఆమె రెండు పర్యాయాలు ఆగ్రామ పంచాయతీకి సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించారు. మత్స్యకార సామాజిక వర్గంలో పట్టున్న ఆమె మరణవార్త తెలిసిన వేలాదిగా ప్రజలు ఎల్లయ్యపేట తరలివచ్చారు. గురువారం నిర్వహించిన అంతిమయాత్రలో పాల్గొన్నారు. టీడీపీ నేతలు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతమనీడి అబ్బాయి ఆమెకు ఘనంగా నివాళి అర్పించారు ఆమె కుమారుడు వెంకటరమణను పరామర్శించి త మ సానుభూతి తెలిపారు. శాసన మండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్యలు బంగారమ్మ మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు.

నోట్ పుస్తకాల పంపిణీ

కాకినాడ సిటీ, జూలై 18: సూర్యనారాయణపురంలోని ప్రభుత్వ పాఠశాలలో సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. దీనికి ఫౌండేషన్ ఛైర్మన్ తలాటం హరీష్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తనయుడు మోహనవర్మ పాల్గొన్నారు.

విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

● బిజినెస్ గురు రమేష్ భటావ్య



బిజినెస్ గురు రమేష్ భటావ్యను సత్కరిస్తున్న పాఠశాల డైరెక్టర్ విజయ్‌ప్రకాష్

పెద్దాపురం, జూలై 18 : విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు ప్రపంచ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని బిజినెస్ గురు రమేష్ భటావ్య (బెంగళూరు) అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ముందుకు సాగాలంటే కేవలం పాఠ్య పుస్తకాలద్వారా వచ్చే జ్ఞానంచాలదని, మరింతగా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలంటే ప్రతీ విషయాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయాలన్నారు. ప్రపంచంలో జరిగే విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. మనిషి ఆర్థిక ఎదుగుదలతో పాటు సమాజాభివృద్ధి దిశగా ఆలోచనచేయాలన్నారు. ఎంత ఉన్నతస్థానానికి ఎదిగినా ఒదిగేతత్వాన్ని అలవాటు చేసుకోవాలని, అందుకు ఉదాహ రణగా పాఠశాల డైరెక్టర్ విజయ్‌ప్రకాష్‌ను చూసి నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

ఓఎన్జీసీ నష్టపరిహారం అందిస్తా: ఎమ్మెల్యే దాట్ల

తాళ్లరేవు, జూలై 18: మత్స్యకారులందరికీ అతి త్వరలోనే ఓఎన్జీసీ నష్టపరిహారం అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. గురువారం తాళ్లరేవు టీడీపీ కార్యాలయంలో గాడిమొగ పంచాయతీ సర్పంచ్ కామాడి గోవలక్ష్మి అధ్యక్షతన నాలుగు గ్రామాల టీడీపీ శ్రేణులు, కార్యకర్తలతో ఓఎన్జీసీ నష్ట పరిహారం, పంచాయతీలో అభివృద్ధి పనులపై చర్చించారు. వేట నష్టపరిహారం ఎమ్మెల్యేలు తెచ్చేవి కావని మీరు వేటనష్టపోతున్నందుకు, కంపెనీలు సముద్రంలో ఓఎన్జీసీ పైపులైను పనులు చేస్తున్నందుకు మీకు నేచురల్‌గా ఇచ్చే నష్టపరిహారం అన్నారు. ఈనెలాఖరుకు ఓఎన్జీసీ పైపులైను పనులు పూర్తవుతున్నాయని నష్టపరిహారం ఒక్కసారిగా ఇచ్చేలా జిల్లా కలెక్టరుతో మాట్లాడినట్లు ఎమ్మెల్యే దాట్ల తెలిపారు. గాడిమొగ గ్రామపంచాయతీ నిధులతో ప్రతీ గ్రామంలో అవసరాల మేరకు అభివృద్ధి చేయాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీజేవీ రమణ, మత్స్యకార నేతలు కామాడి మాతరాజు, కొప్పాడి ధర్మారావు, వనమాడి నూకరాజు, సంగాడి కామేశ్వరరావు, గాడిమొగ, పెదవలసల, లక్ష్మీపతిపురం, చినవలసల గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'టీడీపీ కార్యకర్తలపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేయాలి'

సర్పవరం జంక్షన్, జూలై 18: వైసీపీ హయాంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై నమోదుచేసిన తప్పుడు కేసులను ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, పార్టీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి దంపతులు హోంమంత్రిని కోరారు. గురువారం విజయవాడలో హోంమంత్రి వంగలపూడి అనితను మర్యాదపూర్వకంగా కలుసుకుని సత్కరించి అభినందనలు తెలిపారు. రాజకీయ దురుద్దేశంతో కార్యకర్తలపై నమోదైన కేసులను ఎత్తివేసేందుకు చట్టబద్ధంగా తగిన చర్యలు తీసుకుంటానని హోంమంత్రి అనిత హామీ ఇచ్చారు. అనంతరం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి మహమ్మద్ ఫరూక్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందనలు తెలిపారు.

'వసతి గృహాలకు సన్నబియ్యం సరఫరా చేయాలి'

పిఠాపురం, జూలై 18: ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, వసతిగృహాలకు సన్నబియ్యం సరఫరాచేసి ఆ బియ్యంతో భోజనం వండేలా చర్యలు తీసుకోవాలని అప్సా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పిల్లా చంద్రం డిమాండ్ చేశారు. పిఠాపురం పట్టణంలోని అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం ఆల్ ఇండియా పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం జరిగింది. డాక్టర్ చంద్రం మాట్లాడుతూ గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటుచేయాలని, టీచర్స్, ప్రిన్సిపాల్స్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్లను రెగ్యులర్‌గా నియమించాలని కోరారు. మెరిట్ విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి పి.వెలుగుజ్యోతి, అప్సా రాష్ట్రకమిటీ సభ్యుడు దొండపాటి విజయసాగర్, రేవు సురేష్‌బాబు, సుదీర్, పచ్చిమళ్ల శ్రీను, వాసా సత్తిబాబు, మచ్చర్ల శ్రీనివాస్, తాటిపర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తుని పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం: ఎమ్మెల్యే దివ్య

తుని రూరల్, జూలై18: తుని పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని తుని ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. రూ.80లక్షల నిధులతో తునిలో పార్కు అభివృద్ధి పనులకు ఆమె శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పట్టణ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామని మంచి ప్రణాళికతో సమస్యలన్నీ పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఇనుగంటి సత్యనారాయణ, యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతమనీడి అబ్బాయి, సిద్దాంతపు సత్తిబాబు, మళ్ళ గణేష్, అల్లు రాజు, జల్లు వాసు, నార్ల రత్నాజీ,కుసుమంచి సత్యనారాయణ, కుక్కడపు బాలాజీ, మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు, సిబ్బంది ఉన్నారు.

ఏలేరు నుంచి సాగు నీరు విడుదల

ఏలేశ్వరం, జూలై18: ఏలేరు ప్రాజెక్టు నుంచి సాగునీటిని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ గురువారం విడుదల చేశారు. వ్యవసాయదారులకు ఏవిధమైన అవస్థలు లేకుండా ఏలేరు నుంచి తిమ్మరాజు చెరువుకి 75 క్యూసెక్కులు తిమ్మరాజు చెరువు నుంచి పంటకాలువలకు సాగునీరు విడుదల చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పంట చేతికి అందే వరకు అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రత్తిపాడు జనసేన, బీజేపీ ఇంచార్జ్‌లు వరుపుల తమ్మయ్యబాబు, గంటా బాలు దొర, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి మాజీ జెడ్‌పీటీ సభ్యులు జ్యోతుల పెదబాబు, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, పెంటకోట మోహన్, జిగటాపు సూరిబాబు, పెంటకోట శ్రీధర్, తదితరుల పాల్గొన్నారు.

నిబంధన తొలగించి సీసీఆర్ కార్డులు ఇవ్వాలి

కరప, జూలై 18: భూ యజమాని సంతకం నిబంధనను తొలగించి అర్హులైన వారికి సీసీఆర్ కార్డులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రాజశేఖర్ విజ్ఞప్తిచేశారు. కౌలురైతుల కుటుంబాలను ఆదుకోవాలంటూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమాన్ని గురువారం కరపలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలురైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘం ద్వారా కృషిచేస్తున్నామన్నారు. అనంతరం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. తదనంతరం తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించారు.

ఆదిత్య ఫోరెన్సిక్ విద్యార్థికి ట్రయాథ్లాన్ గోల్డ్‌మెడల్



అఖిల సంజనకు గోల్డ్ మెడల్ బహూకరిస్తున్న దృశ్యం

గండేపల్లి, జూలై18: కాకినాడ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ క్రీడా మైదానంలో జరిగిన 8వ రాష్ట్ర స్థాయి మోడరన్ పెంటాథలాన్ ట్రయాథలాన్, బయాథలాన్ ఛాంపియన్‌షిప్-2024 పోటీల్లో సూరంపాలెం ఆదిత్య డిగ్రీ కళాశాల ఫోరెన్సిక్ సైన్స్ విద్యార్థిని గాలి అఖిల సంజన ట్రయాథ్లాన్(షూట్,ఈత,పరుగు) మహిళ జూనియర్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించింది. ఉత్తరాఖండ్‌లో జరగబోయే నేషనల్ క్రీడలకు అర్హత సాధించింది. ఈసందర్భంగా మోడరన్ పెంటథలాన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు గోల్డ్‌మెడల్ బహూకరించగా డీఎస్‌డీఓటీ శ్రీనివాసకుమార్ సర్టిఫికెట్ అందజేశారు. ఆదిత్య ఛైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, ప్రిన్సిపాల్ విలాస్‌అనిల్ చవాన్ అభినందనలు తెలిపారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే నానాజీ



కాకినాడ క్రైం, జూలై 18: జిల్లా నూతన ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌ను కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ నియోజకవర్గంలోని పలు సమస్యలను ఎస్పీకి వివరించారు.

ఎస్పీని కలిసిన జనసేన ఇన్‌చార్జి

పిఠాపురం, జూలై 18: కాకినాడ జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన విక్రాంత్‌పాటిల్‌ను పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు గురువారం కలిశారు. పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

'పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాల్సిందే'

కొత్తపల్లి, జూలై 18: పోలీసు అధికారులపై తక్షణం చర్యలు చేపట్టాలని టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్‌వర్మ డిమాండ్ చేశారు. కొండెవరం శివారు కాశివారిపాకల్లో రామకోవెల శుభ్రపరిచే క్రమం లో ఆలయంలో జరిగిన సంఘటనలో తలకు తీవ్ర గాయాలైన రాయుడు వెంకటరమణ, పిల్లి లోవరాజు, వాసంశెట్టి శ్రీనివాస్‌లు కొత్తపల్లి పోలీసు లకు ఫిర్యాదు చేశారు. వైసీపీ కార్యకర్తలు ఇనుపరాడ్‌లతో తలపై రక్తాలు కారే విధంగా దౌర్జన్యం చేసినా పోలీసులు నామమాత్రం కేసు నమోదు చేయడంపట్ల బాధితులు గురువారం మాజీ ఎమ్మెల్యే వర్మ దృష్టికి తీసుకొ చ్చారు. ఈ మేరకు స్పందించిన వర్మ పోలీసు అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీకి కాశివారిపాకల బాధితుల విషయంలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదన్నారు. సంఘటన జరిగి సుమారు 40 రోజులు దాటినా ఇప్పటివరకు చర్యలు ఎందుకు చేపట్టలేదని, వెంటనే కాకినాడ డీఎస్పీ, కొత్తపల్లి ఎస్ఐలను సస్పెండ్ చేసి బాధితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే వర్మ డిమాండ్ చేశారు. కాశివారిపాకల బాధితులకు పోలీసుల కారణంగా జరిగిన అన్యాయాన్ని ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్‌కు తెలియజేయనున్నట్లు వర్మ తెలిపారు.